బాచుపల్లి సీఐని అభినందించిన సీపీ

హత్య కేసు నేరాలను నిరూపించి, నిందితులకు శిక్షలు పడేలా కృషి చేసిన బాచుపల్లి సీఐ జే.ఉపేందర్‌రావును సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి అభినందించారు. ఈ మేరకు సీఐకి సీపీ ప్రశంసాపత్రం అందజేశారు. ఉపేందర్‌రావు అమన్‌గల్‌లో సీఐగా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో కడ్తాల్, తలకొండపల్లిలో జరిగిన రెండు హత్య కేసుల్లో సమర్థవంతంగా పనిచేసి నిందితులకు 10 ఏండ్లు శిక్షపడేలా పనిచేయడంతో సీపీ ఆయనకు గచ్చిబౌలిలోని కార్యాలయంలో ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు. *–దుండిగల్, అక్టోబర్ 27*

కాంగ్రెస్‌వి మోసపూరిత వాగ్దానాలు

రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 27: మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థపాలనపై అసంతృప్తిగా ఉన్న ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి అన్నారు. ఆదివారం బాలాజీనగర్ డివిజన్‌లో చేపట్టిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుందని, పేదలందరికీ సంక్షేమ ఫలాలు చేరుతున్నాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కష్టాలను తీర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు జి.వినోద్‌కుమార్ గౌడ్, బీజేపీ నేతలు సూర్యారావు, శ్రీకర్‌రావు, గోపీ, రాము, సోమశేఖర్, భగవంత్, అనీల్, సంతోష్, శేఖర్, సూరిబాబు, ప్రేమ్‌కుమార్, వెంకటరమణ, జగదీష్, చలపతి, వినోద్, జ్యోతి, రేణుక, లహరి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

శేరిలింగంపల్లి, అక్టోబర్ 27: బస్సును ఓవర్‌టేక్ చేయబోయి ముందు వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ముగ్గురు వ్యక్తులకు స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ ఘటన ఆదివారం గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం... రాజేంద్రనగర్‌లోని అసద్‌నగర్‌కు చెందిన ఇస్మాయిల్ (40) ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 27వ తేదీన తన ఆటోలో ఇద్దరు ప్రయాణికులను తీసుకొని మణికొండ నుంచి లింగంపల్లికి బయలుదేరాడు. మార్గమధ్యలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రధాన ద్వారం నుంచి వెళుతున్న ఆటోను రాహుల్, శ్రీకాంత్‌రెడ్డి, సందీప్‌లతోపాటు మరో వ్యక్తి కారులో వేగంగా వస్తు ముందు వెళుతున్న బస్సును ఓవర్‌టేక్ చేసి బస్సు ముందున్న ఆటోను ఢీ కొట్టింది. ఆ తరువాత డివైడర్‌ను ఢీకొట్టి ఫల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలు కాగా, ఆటో ధ్వంసమైంది. మరోవైపు కారులో మద్యం సీసాలు లభించడంతో మద్యం మత్తులో వాహనం నడిపినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని కారులో ఉన్న వారికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి దర్యాప్తు చేస్తున్నారు.

పద్మానగర్ ఫేజ్-1 నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

జీడిమెట్ల, అక్టోబరు 27:కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మానగర్‌ఫేజ్-1 నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. కాలనీ సలహాదారులు ముత్యాలు, వెంకటేశ్వరరావు, శివనాగిరెడ్డి, ఖాసీం, జయసింహారెడ్డిల అధ్యక్షతన జరిగిన సమావేశానికి 400 మంది కాలనీ సభ్యులు హాజరయ్యారు. ఈసందర్భంగా నూతన అసోసియేషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సత్తిరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా దయాకర్, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్‌రెడ్డి, ప్ర ధాన కార్యదర్శిగా దేవేందర్‌రెడ్డి, కోశాధికారిగా ప్రసాద్, సహాయ కోశాధికారిగా అరవింద్‌యాదవ్, సంయుక్త కార్యదర్శులుగా సత్యం, కృష్ణరావు, వేణు, మోహన్, సుబ్బారెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా రంగ సుబ్బయ్య, భాస్కర్‌రెడ్డి, రమణారెడ్డి, సందీప్‌రెడ్డి, ఠాకూర్ వినోద్‌సింగ్, మీడియాకన్వీనర్‌గా సుధాకర్‌తోపాటు 14 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లను నియమించారు.

అక్రమ నిర్మాణాలు అరికట్టాలి

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 27: కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్‌లోని భగత్‌సింగ్ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడంతోపాటు అక్రమ నిర్మాణాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేశ్‌కు కాలనీ సొసైటీ సభ్యులు వినతిపత్రాన్ని అందించారు.సొసైటీ అధ్యక్షుడు నరహర దీక్ష చారి, డైరెక్టర్ సాంబశివరావు, స్థానిక నేతలు మధు, సోసైటీ సభ్యులు ఉన్నారు.

ప్రజల కష్టాలు ప్రభుత్వానికి పట్టడంలేదు

- పది నెలల పాలనలో కాంగ్రెస్ విఫలం
- భవిష్యత్‌లో బీఆర్ఎస్ పార్టీదే విజయం
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ నేతల సమావేశంలో ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 27:మహానగరంలో నివసిస్తున్న ప్రజల కష్టాలు ప్రభుత్వానికి పట్టడం లేదని, పది నెలల కాలంలోనే కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసుగెత్తిపోయారని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాలానగర్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌ల నాయకత్వంలో హైదరాబాద్ నగరం విశ్వనగరంగా అభివృద్ధిని సాధించిందని, రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందన్నారు. సమాజంలోని పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందాయని, అందుకే నేటికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలు మర్చిపోవడంలేదన్నారు. అలవిగాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కష్టాలను పట్టించుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కాలనీలు, బస్తీల్లో చిన్నచిన్న ప్రజా సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల్లో ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లితే... ఆ పనులు చేయడానికి నిధులు లేవని జీహెచ్ఎంసీ, జల మండలి అధికారులు చెప్పడం బాధాకరమన్నారు. గత పదేండ్లలో నియోజకవర్గంలో వేలాది కోట్లతో అభివృద్ధి పనులు చేశామని, నేడు చిన్న పనులు కూడా చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీని గెలిపించడానికి ప్రజలందరూ సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజాసమస్యలను గుర్తించాలని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కాలనీలు, బస్తీల్లో ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే... ఆ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు శాఖయ్య, ఖాజా, సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, మహిళా నేతలు ఉన్నారు.

ఉర్సు ఉత్సవాలు జరుపుకోవడం సంతోషదాయకం



ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సతీశ్‌గౌడ్

బాలానగర్, అక్టోబర్ 27: ఉర్సు ఉత్సవాలు జరుపుకోవడం సంతోషదాయకం అని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం ఫతేనగర్ డివిజన్ పరిధి ఎల్‌బీఎస్ నగర్‌లో హజ్రత్ సయ్యద్ అహ్మద్ కబీర్జా ఉర్సు కార్యక్రమంలో ఆయనతోపాటు డివిజన్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ హాజరై ప్రార్థనలు చేశారు. అనతంరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సంప్రదాయాలకు అనుగుణంగా ఉర్సు ఉత్సవాలు జరుపుకోవడం సంతోషకరం అన్నారు. కార్యక్రమంలో ఆరిఫ్, ఆసిఫ్, అఫ్జల్, జావేద్, ఖాజా, మహబూబ్ సత్తార్ స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్షలో శబరికి కాలినడకన యాత్ర

ధర్మశాస్త అయ్యప్ప దీక్షలో భాగంగా అయ్యప్ప భక్తుడు కాలినడకన 1200 కిలోమీటర్ల యాత్ర చేపట్టడం శుభదాయకమని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఫతేనగర్ డివిజన్‌కు చెందిన ఉప్పల శ్రీనివాస్‌గుప్త బషీర్‌బాగ్‌లోని కనకదుర్గమాత ఆలయంలో ఇరుముడి కట్టుకునే కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు గురుస్వాములు, టీమ్ 8 సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉదాసీన వైఖరి వల్లే ఆలయాలపై దాడులు

ఆలయాలపై దాడులకు నిరసనగా ర్యాలీ నిర్వహిస్తున్న హిందువులు

బాలానగర్, అక్టోబర్ 27: ప్రభుత్వ ఉదాసీన వైఖరి వల్ల ఆలయాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా బాలానగర్‌లో హిందువులు పోలీసు బందోబస్తు మధ్య నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆదివారం సాయంత్రం అంతమ్మగూడ అంబేద్కర్ విగ్రహం నుంచి మొదలైన నిరసన ర్యాలీ ఏయిర్‌ఇండియా ప్రధాన రహదారి నుంచి బాలానగర్ నర్సాపూర్ చౌరస్తా మీదుగా గండెమ్మ ఆలయం వరకు చేపట్టారు. ఆలయాలపై దాడులు చేస్తే సహించేదిలేదు ఖబర్దార్, ఖబర్దార్ అని...భారత్ మాతాకీ జై అని నినాదాలు చేశారు. సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంపై జరిగిన దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గడ్డమీది రాజు, సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, నర్సింహ, సత్యనారాయణ, బాల ప్రసాద్, బాలా చారీ, మనోజ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అల్లాపూర్, అక్టోబర్ 27: డివిజన్ పరిధిలోని గాయత్రినగర్ సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో వివేక్ దంత వైద్యశాల వారి సౌజన్యంతో ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. దంత వైద్యశిబిరాన్ని కార్పొరేటర్ సబీహాబేగం ముఖ్యఅతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అధిక సంఖ్యలో వయోవృద్ధులు, కాలనీవాసులు హాజరై వైద్య సేవలు పొందారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ దంతాలను సంరక్షించుకోవాలని, అప్పుడే మెరుగైన జీవనశైలిని సాగించవచ్చన్నారు.సూరిబాబు, వెంకటేశ్వర్లు, సంజీవరెడ్డి, జ్ఞానేశ్వర్, జహెద్ షరీఫ్ బాబా పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉంటా..

మియాపూర్ డివిజన్ పరిధిలోని పని చేస్తున్న భవన నిర్మాణ కార్మికులకు కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ గుర్తింపు కార్డులను బల్దియా స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు అండగా నిలుస్తానని, ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలను వారికి అందించేందుకు కృషి చేస్తానన్నారు. కార్మికుల జీవన విధానాన్ని మెరుగుపరిచేందుకు పీఏసీ చైర్మన్ గాంధీ తోడ్పాటుతో కృషి చేస్తానని శ్రీకాంత్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు తన్నీరు శ్రీరామ్, వికాస్, మాధవ్, రమేష్, ఆనంద్, సోంబాబు, చిన్న, రాంబాబు పాల్గొన్నారు. *– మియాపూర్, అక్టోబర్ 27*

చెత్త శుద్ధికి.. పది వేలు ప్రోత్సాహం

- లక్ష్య ఛేదనకు నవంబర్ చివరి వరకే గడువు
- జోన్ వ్యాప్తంగా 130కి పైగా వ్యర్థాలు పేరుకునే ప్రాంతాలు

జోనల్ కార్యాలయం

వీధుల్లో చెత్తకుప్ప(ఫైల్)

మియాపూర్, అక్టోబర్ 27: ఐటీకి వేదికగా ఉన్న శేరిలింగంపల్లి జోన్‌లో వీధుల్లో పేరుకుపోతున్న చెత్త కుప్పలు జోన్‌కు మరకను తెచ్చిపెడుతున్నాయి. పారిశుద్ధ్యంపై నెలనెలా లక్షలాది నిధులు వెచ్చిస్తున్నా... పరిస్థితులు మారకపోతుండటంతో అధికారులకు మరింత తలనొప్పిగా మారుతున్నది. ఎట్టి పరిస్థితుల్లోనూ వీధుల్లో పరిశుభ్ర పరిస్థితులను నెలకొల్పేందుకు కసరత్తులు చేస్తున్నారు. బల్దియాలో పారిశుద్ధ్య విభాగం అదనపు కమిషనర్‌గా పని చేసి ఇక్కడి జోన్‌కు జోనల్ కమిషనర్‌గా వచ్చిన ఉపేందర్‌రెడ్డి ప్రత్యేకంగా పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి పరిస్థితులను మెరుగుపర్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే కొంత మేర పురోగతి నెలకొన్నప్పటికీ... వీధుల్లో పేరుకుపోతున్న చెత్త కుప్పలు మాత్రం అపరిశుభ్ర వాతావరణానికి కారణంగా మారాయి. ఈ నేపథ్యంలో గార్బేజ్ వనరబుల్ పాయింట్(జీవీపీ)లను పూర్తి స్థాయిలో ఎత్తివేసేందుకు క్షేత్రస్థాయి సిబ్బందికి నగదు ప్రోత్సాహకాలను నూతన జడ్జీ ప్రకటించారు. గతంలో ఈ తరహాలో జరిగిన ప్రయత్నంలో సఫలం అయిన ఎస్ఎఫ్ఏలకు సదరు ప్రాంతంలో ఘన సత్కారం చేయగా, ప్రస్తుత జడ్జీ మరో అడుగు ముందుకు వేసి రూ.10వేల నగదుతోపాటు, ఘన సన్మానం చేస్తామని ప్రకటించారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని నాలుగు సర్కిళ్లలో తాజాగా చేపట్టిన అధ్యయనంలో 130కి పైగా ప్రాంతాల్లో నిత్యం చెత్త కుప్పలు పేరుకుంటున్నట్లు నిర్ధారించారు. ఇందులో అత్యధికంగా చందానగర్ సర్కిల్ పరిధిలోనే 52 వరకు ఉన్నాయి. అయితే జోన్ వ్యాప్తంగా నాలుగు సర్కిళ్లలో కలిపి మొత్తం 100కు పైగా ఎస్ఎఫ్ఏలు క్షేత్రస్థాయిలో పని చేస్తున్నారు. గుర్తించిన ప్రాంతాల్లో జీవీపీలను పూర్తిస్థాయిలో నియంత్రించే ఎస్ఎఫ్ఏకు రూ.10వేల నగదు ప్రోత్సాహకంతోపాటు అదే ప్రాంతంలో ఘనంగా సత్కరిస్తామని ఇటీవల జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు. ఈ లక్ష్యాన్ని నెలలోగా అంటే నవంబర్ చివరిలోగా చేరుకున్న వారికి ఈ మొత్తాన్ని అందిస్తామన్నారు. త్వరలో ఓ బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి ఏ మేర జీవీపీల నియంత్రణ జరుగుతుందోనన్న తనిఖీలను సైతం చేపట్టనున్నది. ప్రధానంగా ప్రజల్లో చైతన్యంతో పాటు సిబ్బంది చిత్తశుద్ధితో పని చేస్తే లక్ష్య సాధన సులువేనన్న అభిప్రాయాలు నెలకొంటున్నాయి.

అవును.. ప్రోత్సాహకాన్ని ప్రకటించాం..

శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ప్రత్యేకంగా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రధానంగా దృష్టి సారించాం. ప్రతినిత్యం తెల్లవారుజామునే పర్యటనలు ఆకస్మిక తనిఖీల ద్వారా మెరుగైన పరిస్థితుల కోసం కృషి చేస్తున్నాం. జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తరచూ చెత్త పేరుకుంటున్న ప్రాంతాలను గుర్తించాం. వాటిని పూర్తి స్థాయిలో నియంత్రించే సిబ్బందికి రూ.10వేల నగదు ప్రోత్సాహకంతోపాటు అదే ప్రాంతంలో ఘనంగా సన్మానిస్తామని ప్రకటించాం. ఈ లక్ష్యాన్ని నవంబరు చివరి కల్లా చేరుకోవాలని గడువు విధించాం. ప్రధానంగా సిబ్బందిని ఉత్సాహపర్చడం ద్వారా వారి పనితీరును మరింత మెరుగుపరిచి జోన్‌లో పరిశుభ్ర పరిస్థితుల నెలకొల్పడమే మా లక్ష్యం.

– ఉపేందర్‌రెడ్డి, జోనల్ కమిషనర్, శేరిలింగంపల్లి జోన్

ఆటోకార్మిక వ్యతిరేక చట్టాలపై పోరాడుదాం

జగద్గిరిగుట్ట, అక్టోబర్ 27 : ఆటో కార్మికులకు వ్యతిరేకంగా కేంద్రంలోని బీజేపీ తీసుకువచ్చిన చట్టాలకు వ్యతిరేకంగా పోరాడుదామని ఏఐటీయూసీ నేతలు అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్‌లో ఆదివారం కార్మిక సమావేశం జరిగింది. హిట్‌అండ్ రన్ చట్టంతో డ్రైవర్లు జరిమానా, జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. ఇన్సూరెన్స్ కంపెనీలకు లాభం వచ్చేలా వ్యవహరించడం తగదన్నారు. ఫిట్‌నెస్, టాక్స్ పేరుతో ఆటో కార్మికులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. సమస్య పరిష్కారం, కార్మికుల హక్కులకోసం పోరాడతామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఉమామహేశ్, ఏసురత్నం, నర్సయ్య, శ్రీనివాస్, కృష్ణ, రాజ మౌళి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వైభవంగా ధన్వంతరీ స్వామి ప్రతిష్ట మహోత్సం

బాలానగర్, అక్టోబర్ 27 : బాలానగర్ డివిజన్ పరిధి సాయినగర్‌లోని సాయి నాగేంద్రాలయంలో శ్రీ ధన్వంతరీ స్వామి వారి ప్రతిష్ట సామూహిక కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆదివారం సాయి నాగేంద్రాలయం ఆలయ చైర్మన్ అంబటి సునీల్‌కుమార్‌గుప్త ఆధ్వర్యంలో ఫౌండర్ చైర్మన్ అంబటి ప్రసాద్‌రావు పర్యవేక్షణలో సాయంత్రం 6.30 గంటలకు విశ్వక్షేణ పూజ, రక్షబంధన, అంకురార్పన, రాత్రి 8 గంటలకు స్వామివారికి జలాదివాసం, ఫల పుష్పాదివాసం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు, కోశాధికారి యుగంధర్‌లతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా జాయ్ ఫౌండేషన్ సొసైటీ వార్షికోత్సవం

మాదాపూర్, అక్టోబర్ 27: మాదాపూర్‌లోని అరుణోదయ కాలనీలో జాయ్ ఫౌండేషన్ సొసైటీ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాయ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, డాక్టర్ రాజ్‌కుమార్ విచ్చేసి సభ్యులతో కలిసి హాజరై మాట్లాడారు. నిరాశ్రయులైన వృద్ధులకు అన్ని తానై, వారి అవసరాలను తీరుస్తూ మధురానుభూతిని అందించేలా వసతులు కల్పిస్తున్నట్లు ఫౌండర్ రాజ్‌కుమార్ తెలిపారు. అనంతరం జాయ్ ఫౌండేషన్ సొసైటీ అనువల్ రిపోర్ట్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాట్నా రిటైర్డ్ జస్టిస్ నరసింహారెడ్డి, డిజైర్ సొసైటీ ఫౌండర్ రవిబాబు, నటుడు ఉత్తేజ్ ఉన్నారు.

కుంగిన మ్యాన్‌హోల్

దుండిగల్,అక్టోబర్ 27: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, బాచుపల్లిలోని నందనవనం కాలనీలో నెలకొన్న మ్యాన్‌హోల్ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. కాలనీలో ఏడాది కిందటే సీసీ రోడ్డు నిర్మించడంతోపాటు మ్యాన్‌హోల్స్ నిర్మించారని, అయితే నిర్మాణ సమయంలో కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో కొద్ది కాలానికే శిథిలావస్థకు చేరుకున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో ప్రతినిత్యం స్కూల్ బస్సులు తిరుగుతుంటాయని, మ్యాన్‌హోల్ కుంగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు నెల రోజుల కిందటే ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటికీ మరమ్మతులకు నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శిథిలమైన మ్యాన్‌హోళ్లను మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

శిథిలమైన మ్యాన్‌హోల్ ఇదే

రహదారి నిర్మాణ పనుల పరిశీలన

వివేకానందనగర్ డివిజన్ వివేకానందనగర్‌లో రూ.55 లక్షలతో చేపడుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ మాధవరం రోజాదేవిరంగారావు ఏఈ శ్రావణితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో పలు ప్రాంతాల్లో సీసీ రహదారులను మంజూరు చేయించినట్లు డ్రైనేజీ లైన్లు పూర్తి కాగానే పనులను ప్రారంభిస్తామన్నారు. డివిజన్ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రంగారావు పాల్గొన్నారు. *– మియాపూర్, అక్టోబర్ 27*

రామోజీ కుంటను మట్టితో నింపుతున్నరు..

దుండిగల్,అక్టోబర్ 27: గండిమైసమ్మ–దుండిగల్ మండలం, బౌరంపేట్ గ్రామ రెవెన్యూ పరిధిలోని కుంటలు, చెరువులు క్రమంగా మాయమవుతున్నాయి. ఓ వైపు కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో చెరువులు, కుంటలకు సంబంధించిన ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలోని నిర్మాణాలను కూల్చివేస్తున్నా ఆ ప్రభావం ఇక్కడి వారికి కనిపిస్తున్నట్లు లేదు. వివరాల్లోకి వెళ్తే బౌరంపేట్ గ్రామ పరిధి, సర్వే నంబర్ 562లోని రామోజీకుంట(లేక్‌ఐడీ 2824) 2013నాటి ఎఫ్‌టీఎల్ కోఆర్డినేట్స్ ప్రకారం.. 15.57 ఎకరాలు ఉన్నట్లు అప్పటి అధికారులే నిర్ధారించారు. ఇప్పటికే చెరువును ఆక్రమించి ఓ బడా విద్యా సంస్థ నిర్మాణాలు చేపట్టినట్లు అప్పట్లోనే ఆరోపణలు చెలరేగాయి. తాజాగా కొందరు వ్యక్తులు కుంట ఎఫ్‌టీఎల్/బఫర్ జోన్‌లను ఆక్రమించి చదును చేస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. గత పక్షం రోజులుగా ఈ తతంగం నడుస్తున్నప్పటికీ స్థానిక రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అంటే ఇదంతా రెవెన్యూ అధికారులకు తెలిసే జరుగుతుందని విశ్వసనీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఏదిఏమైనా రామోజీకుంట ఆక్రమణలను అధికారులు నిలువరించాలని స్థానికులు కోరుతున్నారు. ఇదే విషయమై రెవెన్యూ అధికారులను ఫోన్‌లో సంప్రదించగా.. వారు అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

అలరించిన నృత్య ప్రదర్శనలు

శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఎంతగానో అలరించాయి. శ్రీ సిద్ధకృష్ణ కూచిపూడి డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ నిర్వాహకులు సుజాత మూర్తి శిష్య బృందం గాయత్రీ, లలిత, సుభద్ర, తాన్యా, శాన్వి, లక్ష్మి, ఆద్య కళాకారులు గణేష పంచరత్న, అంబాష్టకం, వచ్చేను అలమేలుమంగా, భో శంభో, స్వాగతం కృష్ణ, శంకర్ శ్రీగిరి, ఒకపరి కొకపరి, ధనశ్రీ ధిల్లాన, మంగళం సహా పలు అంశాలను ప్రదర్శించారు. బెంగళూరు నుంచి విచ్చేసిన భరత నాట్య కళాకారిణి భూమికగౌడ ఆనంద నర్తన గణపతిమ్, శృంగారలహరి కీర్తన, అష్టపది, ధిల్లాన అంశాలను ప్రదర్శించి ఆహూతులను రంజింప చేశారు. కళాకారులను శ్రోతలు అభినందించారు. *– కొండాపూర్, అక్టోబర్ 27*

హెచ్‌సీయూ విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ కూటమి విజయం

కొండాపూర్, అక్టోబర్ 27 : గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ కూటమి విజయం సాధించింది. శనివారం రాత్రి వెలువడిన ఎన్నికల ఫలితాల్లో యూనియన్‌లో కీలకమైన పదవులను ఎస్ఎఫ్ఐ, బీఎస్ఎఫ్, డీఎస్ యూతో కూడిన ఎస్ఎఫ్ఐ కూటమి ఐదు పదవులను గెలుచుకోగా, ఎన్ఎస్‌యూఐ కూటమి ఒక్క పదవిని దక్కించుకున్నది. శనివారం ఉదయం 10 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవ్వగా.. అర్ధరాత్రి వరకు కొనసాగింది. అధ్యక్ష పదవికి పోటీలో ఉన్న ఎస్ఎఫ్ఐ కూటమి అభ్యర్థి ఉమేశ్‌కుమార్ అంబేద్కర్, స్వతంత్ర అభ్యర్థి ఆకాశ్‌ల మధ్య తీవ్ర ఉత్కంఠగా సాగింది. చివరకు 18 ఓట్ల మెజార్టీతో ఎస్ఎఫ్ఐ కూటమి అభ్యర్థి ఉమేశ్‌కుమార్ అంబేద్కర్ గెలుపొందాడు. ఉపాధ్యక్షుడిగా ఆకాశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా నిహాద్ సులేమాన్, సంయుక్త కార్యదర్శిగా త్రివేణి, కల్చరల్ సెక్రటరీగా కేవీ కృష్ణమూర్తిలు విజయం సాధించారు. ఎన్ఎస్‌యూఐ కూటమి అభ్యర్థి మాంగ్సి స్పోర్ట్స్ సెక్రటరీగా గెలుపొందారు.

ఘన